# 62

# తాజ్‌మహల్ నిర్మాణానికి...

గన్నవరం విమానాశ్రయం, తెనాల్లోని రైల్వే బ్రిడ్జి, రాజమండ్రి దగ్గర బ్యారేజి, హైదరాబాదులోని - హోటల్, అనంతపురంలోని సినిమా హాలు చూసిన వారికి శేషయ్య పేరు తెలిసే అవకాశం లేదు. వీటి నిర్మాణంలో పాల్గొన్న వందలాది కూలీల్లో శేషయ్య వొకడు. అందుకే అతనికో ఊరంటూ లేదు.

"పుట్టిందే ఊరని మీరన్నారనుకోండి నేను తెనాల్లో గంగానమ్మ గుళ్ళో పుట్టా. నేను పుట్టిన వారం రోజులకల్లా మా అయ్య బెజవాడ వచ్చాడు. అక్కడ నాలుగైదేళ్ళు ఉన్నామంట. ఇదంతా మా నాన్న చెబితే నాకు తెలిసింది గానీ, నా చిన్నతనం నాకు బొత్తిగా గుర్తు లేదండీ!" అన్నాడు శేషయ్య తాపీకి అంటుకున్న సిమెంటును, రాయికేసి రాస్తూ.

తన తండ్రి మీదా, అతని పనితనంమీద శేషయ్యకు చాలా గౌరవముంది. తన తండ్రి, ఇంతెత్తున ఉండేవాడుట. చెవులకు కర్ర పోగులుండేవట. ఎడంకాలికి వీరాఘవుల కడియం వుండేదిట. బిళ్ళల మొలతాడు వుండేదిట. సొట్టబోయిన వెండి మురుగులుండేవిట. అన్నం తినేప్పుడు, నిద్రపోయేప్పుడు తప్ప, ఎప్పుడూ చుట్ట కాలుస్తూనే ఉండేవాడట.

"అలాంటి పనివాణ్ణి మళ్ళీ నేను చూడలేదండీ! చిన్న మలాటాతో నరుకుడురాయి అంచుకొట్టి, మూలమీద నుంచో బెట్టాడండే, మూలమట్టానికి సరిపోయేది. నాకు తెలిసినంతలో కొన్ని వందల బిల్డింగులు ఆయన కట్టాడు. మూడేసి నిలువుల రాతిగోడలూ, ఇటికగోడలూ కట్టడం నాకు తెలుసు. మళ్ళీ నూలువేసి చూసుకోనవసరం లేదు. జవరంగా గజం బద్దకు సరిపోతుందే తప్ప నూలువాసికూడా తేడా ఉండడానికే వీల్లేదండి!" అన్నాడు శేషయ్య, పొగాక్కాడను పాయతీస్తూ.

ఈ చుట్ట కాల్చే అలవాటు తనకు చిన్నతనం నుంచి ఉన్నదన్నాడు. చిన్నప్పుడు తనకు ఉబ్బసం ఉండేదిట. చుట్టతాగితే పోతుందని వైద్యుడు చెబితే, అప్పణ్నించి అలవాటయిపోయిందన్నాడు శేషయ్య.

"ఆ రోజుల్లోనండీ! రూపాయికి 3 మానికల బియ్యం ఇచ్చేవాళ్ళు మీరునమ్మరు. నాకు తెలుసు. నేనే తెచ్చాను. ఒకసారి గుంటూర్లో ఏదో పనిచేస్తున్నామండీ! నంబూరు దగ్గర రూపాయికి 3 మానికల గిద్దెడు బియ్యం యిస్తున్నారని ఎవరో అన్నారు. నేనూ, మా అయ్యా, నంబూరు దాకా నడిచి వెళ్ళి, మూడు రూపాయల బియ్యం తెచ్చాం.... ఇప్పుడంటే రూపాయికి ఏమీ రావడంలేదు గానండీ ఆ రోజుల్లో కంటికి రూపాయి కనబడేదే కాదండి! కానీకి కాన్లు మీకు గుర్తేగదండీ- మామిడికాయ మార్కు చిన్న అగ్గిపెట్టెలు రెండిచ్చేవాళ్ళు. నేను కొన్నా" అన్నాడు శేషయ్య అప్పటి సంగతులు గుర్తు చేసుకుంటూ.

ఒక ఊళ్ళో స్థిరంగా ఉండే అవకాశం లేకపోవడం వల్ల శేషయ్య అసలే బళ్లోకి వెళ్ళలేదు. వెళ్ళటం ఇష్టంగా కూడా ఉండేది కాదన్నాడు. "ఎప్పుడన్నా అనిపిస్తుందండి- అయ్యో చదువుకోలేదే! - అని. కానీ చదువు కొన్న మీబోటి దొరలు ఉద్యోగాలకోసం పడే బాధలు చూస్తుంటే, చదువులేకపోవడమే మంచిదనిపిస్తుంది. మా ఆఖరు తమ్ముణ్ని చదవులో వేశాం. వాడికి ఉద్యోగం లేదు. చదువుకొన్న వాడినన్న అహం మాత్రం మాలావు ఉంది బాబు! అందుకని వాడు ఇక్కడ పుల్ల

తీసి అక్కడ పెట్టడు. కట్టినబట్ట నలగనీయడు. తింటానికి బువ్వ ఉంటేనేం, లేకపోతేనేం డాబుసరిగా తిరిగితేసరి'' అని విసుక్కొన్నాడు శేషయ్య.

చిన్నతనం నుండి, అతను కష్టపడి పనిచేసేవాడు. మరీ చిన్నతనంలో ఒక్కో ఇటికా తీసుకొచ్చి, అయ్యకు ఇచ్చేవాడు. ఆ తరువాత, రెండేసి మూడేసి ఇచ్చేవాడు. ఇసికా, సిమెంటూ, ఏ పాళ్లో కలపాలో, ఎలా కలపాలో, ఎలా గోడకడితే పదికాలాలపాటు గట్టిగా ఉంటుందో శేషయ్య అనుభవపూర్వకంగా నేర్చుకొన్నాడు.

''ఇదేం గొప్ప విద్య కాదండీ! శ్రద్ధవుండాలి. గురి ఉండాలి. మాట రాకుండా చూసుకోవాలి. నా చేతిమీదుగా మూడు హైస్కూళ్ళు కట్టా. ఓ కలేజీలో సగం నేనే కట్టా. ఇక ఇళ్ళు, డాబాలు, మేడలు లెక్కేలేదు. రోజుకు ఆరణాల కూలి దగ్గర్నుంచీ నేను పనిచేస్తూనే ఉన్నానండీ!'' అన్నాడతను.

కాంట్రాక్టర్ల దగ్గర పనిచేయడంలో ఉన్న సాధకబాధకాలను అతను చిత్రంగా చెప్పు కొచ్చాడు. రోజు కూలీ చొప్పున పనికొప్పుకుంటే చేసే పద్ధతి వేరుగా ఉంటుందనీ, అదే గుత్తకిస్తే పనిచేసే పద్ధతి వేరుగా ఉంటుందనీ అన్నాడు.

''నేను చేస్తానని కాదండీ! గుత్తదారు చేయనియ్యడు. రోజుకూలీ చొప్పున గోడకట్టించామనుకోండి వారం రోజులు పడుతుందనుకోండి. అదే కాంట్రాక్టుకిచ్చారనుకోండి మూడో రోజుకు లేచిపోతుంది. ఎందుకని అడక్కండి. అదంతే! నేనెప్పుడూ కాంట్రాక్టు తీసుకోలేదు. నా రెక్కలకష్టం నాకుంటే అంతే చాలు... ఒకటికి ఐదు, ఆరు బొచ్చెల ఇసుక కలిపితే ఫర్వాలేదు గానండి- 10 - 12 కలిపి కట్టిన గోడలు, పెళ్ళయి ఊడిపడ్డాయంటే- ఎందుకు పడవండీ! తప్పకుండా పడతాయి. పని చేసే వాళ్ళం ఇట్టానే ఛస్తుంటిమి. పనిచేయించే గుత్తదారు కార్లమీద తిరుగుతుండే. ఏ మోసమూ చేయకుండా, ఏ కల్తీ కలుపకుండా ఇంత డబ్బెలా సంపాదిస్తారండీ!'' అన్నాడు శేషయ్య.

ఇప్పుడు శేషయ్య రోజుకు పదిహేను రూపాయలుసంపాదిస్తాడు. ఈ లెక్కన నెలకు 450 దొరుకుతాయనుకోవద్దంటాడు. అన్ని కాలాల్లోనూ పనులుండవనీ, ముఖ్యంగా వర్షాకాలం నాలుగు మాసాలూ, ఊరికే చేతులు ముందుబెట్టుక్కూచోవాలనీ అంటాడు.

అతనికిప్పుడు నలుగురు పిల్లలు, అందరూ మగపిల్లలే. ''వాళ్ళకన్నా చదువు చెప్పించమంటది మా ఇంటిది. చదువుకొంటే పని వంటపట్టదేమోనని నా భయం!'' అన్నాడతను.

తనేమీ నిలవలో లేననీ, ఒక్కడి సంపాదనతో ఇంత మందిని సాకడమే కష్టమనీ, అప్పులు మాత్రం లేవనీ చెప్పాడు.

''పండక్కీ పబ్బానికీ కూడా తాగను. నేను తాగేదల్లా చుట్ట మాత్రమే!'' తన చేతుల మీదుగా వందల కొద్దీ ఇళ్ళు కట్టిన శేషయ్య, ఇన్నేళ్ళ తరువాత కూడా తనకో సొంత ఇల్లంటూ ఏర్పాటు చేసుకోలేకపోయాడు.